క్లుప్తంగా

ఆకాశంలో అరుణవర్ణం



చూపరులను ఆకట్టుకున్న ఆకాశం

పార్వతీపురం రూరల్: వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల కారణంగా సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రం సరిహద్దుల్లోని కొండ కోనల ప్రాంతంలో చూపరులకు కనువిందు చేసేలా సిందూరపు వర్ణంలో నింగి దర్శన మిచ్చింది. నైరుతి రుతుపవనాలు సమీపిస్తున్న తరుణంలో సాయం సంధ్యవేళ ఆకాశంలో ఆవిష్కృతమైన ఈ దృశ్యాన్ని చూసి ప్రకృతి ప్రేమికులు ఆశ్చర్య చకితులయ్యారు. తమ సెల్‌ఫోన్ కెమెరాల్లో ఆ దృశ్యాన్ని బంధించి ఆస్వాదించారు.

బస్సును పునరుద్ధరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పార్వతీపురంటౌన్: నారాయణపురం బ్రిడ్జిని ప్రారంభించి పాత పద్ధతిలో పార్వతీపురం -గౌరీపురం బస్సును పునరుద్ధరించి బలిజిపేట వరకు న డపాలి. ఈ మేరకు నారాయణపురం వద్ద బైపాస్ రోడ్డు నిర్మించాలని సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసిన అనంతరం కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బలిజిపేట మండల కార్యదర్శి యమ్మల మన్మథరావు, సీపీఎం నాయకుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలి



బలిజిపేటలో సమ్మె పోస్టర్లను చూపుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

బలిజిపేట:

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలని ఆ పథకం కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం మండలశాఖ అధ్యక్షురాలు లక్ష్మమ్మ అధ్యక్షతన బలిజిపేటలో సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు మాట్లాడుతూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికచట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వస్తోందని, లేబర్‌కోడ్‌లు అమలు చేస్తే కనీసం కార్మికులు తమ సమస్యలపై నిరసన కూడా తెలియజేసే అవకాశం కోల్పోతారన్నారు. లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ, కార్మికుల సంక్షేమం నిమిత్తం చేపడుతున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలుచేయాలి

బలిజిపేట: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా మెనూ ప్రకారం అమలు చేయాలని ఎంఈఓ-2కె.శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు బలిజిపేట ఉన్నత పాఠశాలలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మెనూ ప్రకారం ఏ విధంగా అమలు చేయాలో వివరించారు. బియ్యం మంచి నాణ్యమైన ఫోర్టిఫైడ్ రైస్‌ను అందించనున్నామని దానివల్ల ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులకు వాటిని సక్రమంగా వండి అందరూ సంతృప్తిగా తినే విధంగా పథకాన్ని అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ-2 శ్రీనివాసరావు

అందరికీ ధన్యవాదాలు



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: తన పుట్టినరోజు సందర్భంగా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపేందుకు మైదాన, గిరిజన, గిరిశిఖర సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు అని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పట్టణంలో తన గృహంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆదివారం తన పుట్టినరోజుకు ఊహించని విధంగా సుమారు 5 వేల మంది ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, శ్రేయోభిలాషులు తరలివచ్చారన్నారు. మండుటెండను కూడా పట్టించుకోకుండా, రెట్టించిన ఉత్సాహంతో వచ్చిన అభిమానుల గురించి ఆయన మాట్లాడుతూ పదవి, అధికారం ఉన్నా లేకున్నా తాను మీ గుండెల్లో ఉన్నానని చాటి చెప్పారన్నారు. వైఎస్సార్‌సీపీపై, జగన్ మోహన్‌రెడ్డిపై, తనపై ఇంత ఆదరణ, అభిమానం చూపుతున్న అందరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి

పార్వతీపురంటౌన్:

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా ఇటీవల నియమితులైన పార్వతీపురం పురపాలక సంఘానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ముగడ జగన్‌మోహన్ రావు మాజీ ఎమ్మెల్యే జోగారావును సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం పూర్తి స్థాయిలో కృషి చేయాలని మళ్లీ రాష్ట ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను చేసుకునేందుకు అందరితో కలిసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే జోగారావును మర్యాదపూర్వకంగా కలిసిన ముగడ జగన్‌మోహన్‌రావు

తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శ్రమదానం

సీతానగరం:

మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వీఆర్‌ఏలు సోమవారం శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయానికి నిరంతరం తిరుగాడుతున్న ప్రజల సౌకర్యార్థం వీఆరేలంతా శ్రమదానంతో పిచ్చి మొక్కలను తొలగించాలని తహసీల్దార్ ఇచ్చిన సూచనల మేరకు శ్రమదానం చేశారు. తొలకరి కాలం రావడం ప్రాంగణంలో గల కొబ్బరి మొక్కల చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడం, నిరంతరం ప్రజలు తిరుగాడే రహదారిలో పిచ్చిమొక్కలు పెరగడంతో వాటిని వీఆరేలంతా తొలగించారు.

గుండె వ్యాధిగ్రస్తుడికి బ్రాహ్మణ సమాఖ్య అండ

సీతానగరం: ఆర్థికంగా, ఆరోగ్యపరమైన సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి రాష్ట బ్రాహ్మణ సమాఖ్య ద్వారా ఇతోధికంగా సహకారం అందించడానికి సిద్ధంగా ఉందని బ్రాహ్మణ సమాఖ్య రాష్టప్రచార కార్యదర్శి గన్నవరపు శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలకేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గజపతినగరం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన గుండె సంబంధిత వ్యాధితో ఇబ్బందులు పడుతున్న వ్యక్తికి ఫేస్‌మేకర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ విషయం జిల్లా సమాఖ్యకు తెలియడంతో సమాఖ్య అధ్యక్షుడు టీవీ శ్రీనివాసులు సూచనలతో తనతో పాటు సమాఖ్య ప్రతినిధి సూర్యనారాయణ బాధిత కుటుంబాన్ని పరామర్శించి అనారోగ్యానికి గల కారణాలను తెలుసుకుని సమాఖ్య తరఫున రూ.40 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశామన్నారు. జిల్లావ్యాప్తంగా బ్రాహ్మణ కుటుంబాలకు ఎటువంటి సమస్య వచ్చినా ఇతోధికంగా ఆదుకుంటామ న్నారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య కోశాధికారి కూర్మెళ్ల సరోజిని, సభ్యులు భమిడిపాటి రామకుమార్, ఇనగంటి సురేష్‌కుమార్ ముద్దుశ్రయన్, శర్మ, బళ్లమూడి సూర్యనారాయణ పాల్గొన్నారు.



గుండె వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సహాయం అంద జేస్తున్న రాష్ట్ర ప్రచారకార్యదర్శి గన్నవరపు శ్రీనివాస్

వాణిజ్య పంటలపై దృష్టిసారించాలి:

బలిజిపేట: వాణిజ్య పంటలపై దృష్టిసారించాలని, మట్టి పరీక్షలు చేయించుకుని అందుకు తగిన విధంగా ఎరువులను వినియోగించాలని, పచ్చిరొట్ట విత్తనాలు వినియోగించి భూసారాన్ని పెంచుకోవాలని శాస్త్రవేత్తల బృందం రైతులకు సూచించింది. వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా మండలంలోని గంగాడ, బర్లి, వంతరాం గ్రామాల్లో ముగ్గురు శాస్త్రవేత్తల బృందం రైతులకు అవగాహన కల్పించింది. వరికి ప్రత్యామ్నాయంగా నీటి సదుపాయం గల మెట్టు భూమిలో ఆయిల్ పామ్ సాగుచేసుకోవడం మంచిదని సూచించారు. జాతీయ జీవాల మిషన్‌లో భాగంగా 50శాతం సబ్సిడీ వినియోగించుకోవాలని శాస్త్రవేత్త విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. మట్టి పరీక్షల ద్వారా ఎరువులను వినియోగించాలని, భూసారాన్ని పెంచడం కోసం పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవాలని, బిందుసేద్యంపై రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. మొక్కజొన్న సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. భూమిలో సేంద్రీయ కార్బన్ తగ్గిందని ఇందుకు పశువుల పెంట, పచ్చిరొట్ట ఎరువులు, నవధాన్యాలు వేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కేవీకే వెంకటేశ్వరరావు, పార్వతీపురం డీఆర్‌సీ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఆర్.శ్రీనివాస్, ఏఓ శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారలోపంతో బాధపడరాదు



సామూహిక సీమంతం చేస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఎవరూ పౌష్టికాహార లోపంతో బాధపడరాదని స్త్రీశిశు, గిరిజన సంక్షేమశాఖమంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని వైటీసీలో సాలూరు మండలంలో గల గిరిజన గర్భిణులు, బాలింతలు,7 నెలల నుంచి 3 ఏళ్ల లోపు గల చిన్నారులకు పాలపాడి ప్యాకెట్లను ఆమె సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పౌష్టికాహార ఆవశ్యకతను వివరించారు. సామూహిక సీమంతం నిర్వహించారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ డా.టి.కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలి

సీతానగరం: ఖరీఫ్ సీజన్ వచ్చినా మండలంలోని కౌలు రైతులకు ఇంతవరకూ సీసీఆర్సీ కార్డులు పంపిణీ చేయకపోవడం శోచనీయమని కౌలురైతు సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్‌వీ రమణమూర్తి అన్నారు. ఈ మేరకు సీసీఆర్సీకార్డులు పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం రైతు సంఘం, వ్యవసాయ కార్మికసంఘం కౌలురైతు సంఘ నాయకులతో కలిసి తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లాఅధ్యక్షుడు బి.అప్పారావు, రైతుసంఘం జిల్లా, మండల నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, ఆర్.ఈశ్వరరావు, ఆర్.తిరుపతిరావు, పి. సత్యం, ఆర్.శ్రీను, కె.వెంకట్ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యప్రాప్తి

బలిజిపేట: యోగాతో ఆరోగ్యప్రాప్తి లభిస్తుందని సీడీపీఓ ఎస్.సులేఖ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్, డీఆర్‌డీఏలు సంయుక్తంగా బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో రంగోలి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించాయి. ఈ సందర్భంగా సీడీపీఓ సులేఖ మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం ప్రాప్తిస్తుందన్నారు. అన్ని అనారోగ్యాలకు, శారీరక రుగ్మతలు తొలగించేందుకు, మనశ్శాంతికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రంగోలి ద్వారా యోగా కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు రంగు,రంగుల ముగ్గులను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్, ఎంపీడీఓ నగేష్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి, ఈఓపీఆర్‌డీ పుష్పారావు, పశు వైద్యాధికారి గణేష్, మండలస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతోనే ఇంద్రియాలు ఆధీనం

పార్వతీపురం: యోగాతోనే ఇంద్రియాలను మన ఆధీనంలో ఉంచుకోవచ్చని పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐటీడీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యోగా శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా కార్యక్రమంలో అధికారులు, మహిళలు, యువత పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 20 వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ ఎ.మురళీధర్, ఏఓ దుర్గాప్రసాద్, డీఆర్‌డీఏ ఏడీ వై. సత్యంనాయుడు, డీడీ కృష్ణవేణి, అలాగే వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ గిరిజన, వ్యవసాయశాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలి

సాలూరు రూరల్: ఉపాధి కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మర్రిశ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎగువ శెంబి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నామని మర్రి శ్రీనివాస రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలల తరబడి ఉపాధి పనులు చేసినా కూలి డబ్బులు చెల్లించకపోవడం విచారకరమన్నారు. 14 రోజుల్లో కూలి చెల్లించాలన్న నిబంధనలు పాటించకుండా కూలీలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఉపాధి కూలీ రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి కుటుంబానికి 200 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు.



పార్వతీపురానికి ఉత్సవ శోభ



శ్రీ ఇప్పలపోలమ్మ వారు



శ్రీ బంగారమ్మతల్లి అమ్మవారు



శ్రీ ఎర్ర కంచమ్మవారు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం గ్రామదేవతలైన ఇప్పలపోలమ్మ, ఎర్ర కంచమ్మ, బంగారమ్మ గ్రామదేవతల జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ఉత్సాహంగా సాగుతున్నాయి. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు ఆంధ్ర, ఒడిశాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తరువాత 2023లో పార్వతీపురం జాతరను వైభవంగా నిర్వహించారు. జాతర మొదటి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఉయ్యాల-కంబాల కార్యక్రమం నిర్వహించారు. రెండవ రోజు సోమవారం తొలేళ్ల ఉత్సవం జరగ్గా.. మంగళవారం అమ్మవారి సిరిమానోత్సవం నిర్వహించి భారీ ఊరేగింపుతో ఘటాలను స్థానిక అమ్మవార్ల ఆలయాలకు తరలిస్తారు. బుధవారం ఘటాల అనుపోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాలు నాలుగు రోజులు అట్టహాసంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. సంప్రదాయ నృత్యాలు, డ్యాన్స్ ఇవెంట్‌లు, కోలాటాలు ఏర్పాటు చేశారు.

భారీగా విద్యుత్ అలంకరణ

జాతర సందర్భంగా పట్టణ ప్రధాన రహదారి సారికి వీధి నుంచి పాత బస్టాండ్ వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. వైకేఎం కాలనీ, బంగారమ్మ కాలనీలో విద్యుత్ అలంకరణ అందరినీ ఆకట్టుకుంటోంది. ఉత్సవాల విజయవంతానికి ఉత్సవ కమిటీ పూర్తి ఏర్పాట్లు చేసింది.